అభివృద్ధి బీఆర్ఎస్‌ది.. ప్రచారం కాంగ్రెస్‌ది

- ఇదీ ఆలయాల అభివృద్ధిపై దేవాదాయ శాఖ ప్రగతి నివేదిక తీరు
- బీఆర్ఎస్ చేపట్టిన పథకాలను తమ ఖాతాలో వేసుకున్న ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): అభివృద్ధి బీఆర్ఎస్‌ది.. ప్రచారం కాంగ్రెస్‌ది.. అన్న చందంగా ఉంది దేవాదాయ శాఖ విడుదల చేసిన వార్షిక ప్రగతి నివేదిక. గత బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలన్నీ తమ ఖాతాలో వేసుకొని తామే చేసినట్టు చెప్పుకొచ్చారు. యాదాద్రి, భద్రాద్రి, వేములవాడ ఆలయాలే కాదు.. పల్లెల్లోని చిన్నచిన్న ఆలయాల్లోనూ నిత్యం దీపారాధన జరుగాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధూప దీప నైవేద్య కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయితే, గత ఏడాదిగా ఆలయాల అభివృద్ధికి ఏ ఒక్క చెప్పుకోదగ్గ కార్యక్రమాన్ని చేపట్టని కాంగ్రెస్ ప్రభుత్వం.. గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను తామే చేసినట్టుగా చెబుతూ డిసెంబర్ 2023-డిసెంబర్ 2024 ప్రగతి నివేదికను విడుదల చేయడం గమనార్హం.

సామూహిక కార్తీక దీపోత్సవాలు..

ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన సమ్మక్క సారలమ్మ, బోనాల పండుగలకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చి ఘనంగా నిర్వహించింది. వీటికోసం ప్రభుత్వం ఏటా ప్రత్యేక నిధులు కేటాయించింది. కార్తీకమాసంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన ఆలయాల్లో సామూహిక కార్తీక దీపోత్సవాలను ప్రారంభించింది. స్వరాష్ట్రంలో కృష్ణా, గోదావరి నదుల ఒడ్డున పుణ్యస్నానాల కోసం ప్రత్యేక స్నానఘట్టాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేసింది.

భూముల పరిరక్షణకు ప్రత్యేక డ్రైవ్..

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలోని వేలాది ఎకరాల ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయి. వాటిని కాపాడే ఉద్దేశంతో కేసీఆర్ సర్కారు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆలయ భూములకు దేవుడినే యజమానిగా చేస్తూ ఆ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధం విధించింది. రెవెన్యూ, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటుచేసి ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. భూములను ఎవరైనా కబ్జాచేస్తే కఠిన శిక్షలకు చర్యలు చేపట్టింది.

యాదాద్రి ఆలయ పునరుద్ధరణ..

యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సుమారు రూ.1200కోట్లతో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ సర్కారుకే దక్కింది. దేశంలోని ప్రధాన ఆలయాలకు తీసిపోకుండా ఈ ఆలయాన్ని అధునాతన పద్ధతుల్లో పునరుద్ధరించింది. స్వర్ణ గోపురం నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి స్వయంగా అప్పటి సీఎం కేసీఆర్ తనవంతుగా బంగారాన్ని విరాళంగా ఇచ్చారు. కురవి వీరన్న ఆలయంతోపాటు పలు ఆలయాలకు కానుకలు సమర్పించిన ఘనత కేసీఆర్ సర్కారుకే దక్కింది. భద్రాచలం సీతారామచంద్ర స్వామి, వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి రూ.100 కోట్ల చొప్పున నిధులు కేటాయించి అభివృద్ధికి ప్రణాళికలు వేసింది. దైవదర్శనం, ఇతర సేవలకు ఆన్‌లైన్ విధానం, వెబ్ కెమెరాల సాయంతో పూజలతోపాటు ఇతర సేవలు నిర్వహించేందుకు ఏర్పాట్లుచేసింది. వాస్తవాలు ఇలా ఉంటే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఆలయాల అభివృద్ధి అంతా తామే చేసినట్టుగా ఏడాది నివేదిక వెల్లడించడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది.

కొత్త చైర్మన్‌కు కత్తిమీద సామేనా?

- టీజీపీఎస్సీని వెంటాడుతున్న కోర్టు కేసులు, వివాదాలు
- బుర్రా వెంకటేశంను చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు
- నేడు పదవీ విరమణ పొందనున్న మహేందర్‌రెడ్డి



హైదరాబాద్‌లోని హోటల్ టూరిజం ప్లాజాలో ఐఏఎస్ అధికారి బుర్ర వెంకటేశానికి బీసీ సంక్షేమ శాఖ ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై వెంకటేశానికి శుభాకాంక్షలు తెలిపారు. టీజీపీఎస్సీ చైర్మన్‌గా నిబద్ధతతో పని చేసి అందరికీ మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ఒక వైపు కోర్టు కేసులు.. మరో వైపు సిబ్బంది కొరత.. అరకొర నిధులు. ఇంటిదొంగల బెదడ.. పైగా మితిమీరిన ప్రభుత్వ జోక్యం.. ఇలాంటి ఒత్తిడుల మధ్య టీజీపీఎస్సీ చైర్మన్ బాధ్యతలు కత్తిమీద సామేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీనియర్ ఐఏఎస్ బుర్రా వెంకటేశం టీజీపీఎస్సీ నూతన చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన నియామకానికి గవర్నర్ ఆమోదం తెలపగా టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమిస్తూ సీఎస్ శాంతికుమారి జీవోను జారీచేశారు. ప్రస్తుత చైర్మన్ డాక్టర్ ఎం మహేందర్‌రెడ్డి సోమవారం పదవీ విరమణ పొందనున్నారు. చట్టం ప్రకారం కమిషన్ చైర్మన్ గరిష్ఠంగా ఆరేండ్లు లేదా 62 ఏండ్ల వయస్సు వచ్చే వరకు పదవిలో ఉండవచ్చు. వయస్సు రీత్యా బుర్రా వెంకటేశం 2030 ఏప్రిల్ వరకు చైర్మన్‌గా కొసాగుతారు. ఐదున్నరేండ్లపాటు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ప్రభుత్వం జీవో జారీచేసిన నేపథ్యంలో బుర్రా వెంకటేశం సోమవారం లేదా ఒకట్రెండు రోజుల్లో బాధ్యతలను స్వీకరించనున్నట్టు తెలిసింది.

కత్తిమీద సామే..

టీజీపీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించడమంటే కత్తిమీద సామేనన్న వాదనలు ఉన్నాయి. గ్రూప్-1 సహా పలు పేపర్ లీకేజీల్లో టీజీపీఎస్సీ ఉద్యోగుల హస్తమున్నట్టు బయటపడింది. కొత్త చైర్మన్ తొలుత ఇంటిని చక్కబెట్టుడుతూ.. తిన్నింటి వాసాలు లెక్కబెట్టేవారి పనిపట్టాల్సి ఉంటుందన్న వాదనలున్నాయి. టీజీపీఎస్సీలో ఉద్యోగుల కొరత మరో సమస్యగా మారింది. ఇటీవల కొత్తగా 142 పోస్టులను ప్రభుత్వం మంజూరుచేసింది. వీటిలో 58 పోస్టులను డిప్యూటేషన్, 11 పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీచేయాల్సి ఉన్నది. కొత్తగా రిక్రూట్ చేసుకోవాల్సినవి 73 పోస్టులు మాత్రమే ఉన్నాయి. ఇదిలా ఉండగా 10 మంది సభ్యులు ఉండాల్సిన కమిషన్‌లో ప్రస్తుతం ఐదుగురు మాత్రమే ఉన్నారు. కమిషన్ సభ్యుల్లో అనితారాజేంద్ర ఫిబ్రవరిలో రామ్మోహన్‌రావు ఏప్రిల్లో పదవీ విరమణ పొందనున్నారు. ఏడాదిన్నర తర్వాత ప్రొఫెసర్ నర్రి యాదయ్య పదవీ విరమణ పొందుతారు. ఇప్పుడున్న సభ్యుల్లో కేవలం అమీరుల్లా ఖాన్, పాల్వాయి రజనీకుమారి మాత్రమే ఎక్కువకాలం పదవీలో ఉండనున్నారు. దీంతో కొత్త సభ్యులను ప్రభుత్వం ఎప్పుడు నియమిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

కేసులు.. వివాదాలు..

- టీజీపీఎస్సీ జారీచేసిన పలు నోటిఫికేషన్ల విషయంలో కోర్టు కేసులు, వివాదాలు వెంటాడుతున్నాయి. మరీ ముఖ్యంగా ఇటీవల విపరీతమైన కోర్టు కేసులు కమిషన్‌కు సమస్యగా మారాయి.
- గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను నిర్వహించినా ప్రిలిమ్స్ ఫలితాలు సహా అనేక అంశాలపై అనేక వివాదాలున్నాయి. ఒక్క గ్రూప్-1 పైనే 15 కోర్టు కేసులున్నాయి. ఇది కొత్త చైర్మన్‌కు సమస్యకు మారనున్నది.
- గ్రూప్-2 పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించాల్సి ఉన్నది. గ్రూప్-2 పరీక్షల రోజే ఆర్ఆర్‌బీ పరీక్షలున్నాయి. ఈ నేపథ్యంలో గ్రూప్-2ను ఈ నెలాఖరు వరకు వాయిదావేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. పరీక్షలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించవద్దని కోరుతున్నారు. ఇది సమస్యగా పరిణమించనున్నది.
- గ్రూప్-3 పరీక్షలను నిర్వహించినప్పటికీ ఫలితాలు విడుదల చేయాల్సి ఉన్నది. ఇటీవల ఒకే అభ్యర్థి మూడు, నాలుగు ఉద్యోగాలు పొందుతున్నారు. ఉద్యోగంలో చేరిన కొంతకాలానికే ఉన్నతోద్యోగం రావడంతో వెళ్లిపోతున్నారు. దీంతో భర్తీచేసిన పోస్టులు బ్యాక్‌లాగ్ పోస్టులవుతున్నాయి. దీనికి పరిష్కారంగా పైస్థాయి ఉన్నతోద్యోగాలను ముందుగా భర్తీచేసి, ఆ తర్వాత కిందిస్థాయి ఉద్యోగాలు భర్తీచేస్తే బ్యాక్‌లాగ్‌ను నివారించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాల్సి ఉన్నది.
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల క్యాటగిరీ ఉద్యోగాల భర్తీలో సమస్యలు తలెత్తుతున్నాయి.
- జీఆర్ఎల్‌లో నిలిచినవారంతా గతంలో ఏదో ఒక ఉద్యోగం పొందిన వారేకావడంతో ఐదుసార్లు, ఆరుసార్లు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించాల్సి వస్తున్నది. ఇలాంటి సమస్యలను కొత్త చైర్మన్ ఎలా పరిష్కరిస్తారో.. ఎలా ముందుకెళ్తారోనన్న చర్చలు సాగుతున్నాయి.

48 ఎకరాల ఆలయ భూములు స్వాధీనం

హైదరాబాద్, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): ఆలయ భూముల పరిరక్షణలో భాగంగా రంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలో 48 ఎకరాలకు పైగా ఆలయ భూములు, ఇతర ఆస్తులను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు దేవాదాయశాఖ ప్రకటించింది. స్వాధీనం చేసుకున్న భూములకు ఫెన్సింగ్ ఏర్పాటుచేయడంతోపాటు సైన్‌బోర్డులను కూడా నెలకొల్పినట్లు అధికారులు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ సర్కారు దేవాదాయ భూములను దేవుడి భూములుగా ప్రకటించి వాటి క్రయవిక్రయాలపై పూర్తి నిషేధం విధించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా అన్యాక్రాంతమైన భూములను కాపాడేందుకు ప్రత్యేక డ్రైవ్ కూడా చేపట్టింది. తాజాగా వికారాబాద్ జిల్లా తాండూరు మండలం అనంతారంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయానికి చెందిన 16.29 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్‌లోని రంగనాయకస్వామి ఆలయానికి చెందిన షాబాద్ మండలం మన్నిమర్రి గ్రామం సర్వే నంబర్-280 లోని 5.03ఎకరాలు, కడ్తాల్ చెన్నకేశ్వరస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్లు 120, 125, 130లోని 26.21ఎకరాలు స్వాధీనం చేసుకున్నట్టు దేవాదాయశాఖ వెల్లడించింది.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

- లేకుంటే10న కలెక్టరేట్ల ముట్టడి
- బీసీ విద్యార్థి సంఘం పిలుపు

హైదరాబాద్, డిసెంబర్1 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, లేకుంటే 10న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లను, ఎమ్మార్వో కార్యాలయాలను ముట్టడిస్తామని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ హెచ్చరించారు. ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 16లక్షల75వేలమంది విద్యార్థులు దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయారని వాపోయారు. కాంగ్రెస్ వచ్చాక విద్యావ్యవస్థ మొత్తం గాడి తప్పిందని మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే 10న కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

నిడమనూరు మోడల్ స్కూల్ టీచర్ సస్పెన్షన్

- ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసులు

నిడమనూరు, డిసెంబర్ 1: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణల నేపథ్యంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు దొడ్డా ఆంజనేయులును సస్పెండ్ చేస్తూ డీఈఓ భిక్షపతి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థినులు మూడ్రోజుల క్రితం ప్రిన్సిపాల్ నిర్మలకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తల్లిదండ్రులు శనివారం పాఠశాల ఎదుట ఆందోళన చేసి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను నిలదీసిన ఘటనపై వార్తా కథనాలు ప్రచురితమవడంతో ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించారు. ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌పై సర్కార్ కేసు

మొదటిపేజీ తరువాయి...

సంక్షేమ వసతిగృహంలోకి వెళ్లారంటూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. 447 సెక్షన్ కింద నమోదు చేసిన కేసును దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ప్రవీణ్‌కుమార్ బృందం వసతి గృహాలకు వెళ్లిన సమయంలో అక్కడి విద్యార్థులు తమకు కనీస సౌకర్యాల్లేవని, కుళ్లిపోయిన కూరగాయలు, నాణ్యతలేని భోజనం వడ్డిస్తున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ప్రవీణ్‌కుమార్ భరోసా ఇచ్చారు. అయితే ఈ ఘటన ఉదయం 11 గంటలకు జరగ్గా, శేరిగూడ పాఠశాల ప్రిన్సిపాల్ ధనలక్ష్మి మాత్రం సాయంత్రం ఇబ్రహీంపట్నం స్టేషన్‌లో తమకు సమాచారం ఇవ్వకుండా క్యాంపస్‌లోకి వచ్చారంటూ ఫిర్యాదు చేశారు. ప్రవీణ్‌కుమార్ శేరిగూడ రెసిడెన్షియల్ పాఠశాలకు వెళ్లినప్పుడు అక్కడ ప్రిన్సిపాల్ లేరని, సాయంత్రం వచ్చి ఫిర్యాదు చేయడంపై బీఆర్ఎస్ నాయకులు మండిపడుతున్నారు. సమస్యలు తెలుసుకునేందుకు వచ్చిన ప్రవీణ్‌కుమార్‌పైనే ప్రిన్సిపాల్ కేసు పెట్టడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ అధికార పార్టీకి తొత్తుగా మారి, వారి కన్నుసన్నలో ప్రవీణ్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారని బీఆర్ఎస్వీ నాయకుడు రాజ్‌కుమార్ మండిపడ్డారు.

ప్రవీణ్‌కుమార్‌పై శేరిగూడెం ప్రిన్సిపాల్ ఫిర్యాదు: కార్యదర్శి

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.. గురుకులాలపై ప్రభుత్వ వ్యతిరేక ప్రచారంతో రెచ్చగొడుతున్నారని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గురుకులాల్లోని పాత పరిచయస్తులతో కలిసి అధ్యాపకులను, విద్యార్థులను బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. గురుకుల బడిబాటలో భాగంగా పలువురు బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన ఇబ్రహీంపట్నం శేరిగూడలోని బాలురు ఎస్సీ గురుకులాన్ని సందర్శించారని, అనుమతి లేకుండా గురుకులంలోకి ప్రవేశించి అధ్యాపకులను, విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. ఈ మేరకు అక్కడి గురుకుల ప్రిన్సిపాల్ ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు.

కుళ్లిన కూరగాయలతో భోజనమా?

- కలుషిత ఆహారంతోనే విద్యార్థుల అస్వస్థత
- మరుగుదొడ్లు లేక అవస్థలు
- దయనీయంగా సంక్షేమ హాస్టళ్లు
- విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్
- బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్
- హయత్‌నగర్, ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ గురుకుల బాట

వసతిగృహంలోని విద్యార్థికి భోజనం తీసుకువచ్చిన తల్లిదండ్రులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్

రంగారెడ్డి, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల విద్యార్థులకు కుళ్లిన కూరగాయలతో నాసిరకం భోజనం పెడుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఐపీఎస్ మాజీ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. గురుకులాల్లోని వసతులు, విద్యార్థులకు అందుతున్న భోజనం, సౌకర్యాలను తెలుసుకునేందుకు ఆదివారం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం మండలాల్లోని వివిధ రెసిడెన్షియల్ వసతి గృహాల్లో ఆయన ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ బృందం గురుకులాల బాట నిర్వహించింది. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ సమస్యలను వారికి ఏకరువు పెట్టుకున్నారు. అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం అరకొర నిధులనే కేటాయిస్తున్నదని, కనీసం నాణ్యమైన భోజనం పెట్టలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉన్నదని మండిపడ్డారు. రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు అత్యంత దయనీయ స్థితిలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ ఆధారాలతో సహా బయటపెట్టిందని చెప్పారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను బీఆర్ఎస్ ఎక్కడికక్కడ ఎండగడుతుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం మతిస్థిమితం లేని మంత్రులతో ఆధారాలులేని ఆరోపణలు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యార్థులు మరుగుదొడ్లు లేక, కూర్చునేందుకు బెడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. హయత్‌నగర్‌లోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, శేరిగూడలోని రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, ఇబ్రహీంపట్నం నల్లకుంటలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలను బీఆర్ఎస్ బృందం పరిశీలించింది. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు గెల్లు శ్రీనివాస్, ఎర్రొళ్ల శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, ఆంజనేయులు, మున్సిపల్ మాజీ చైర్మన్ కంబాలపల్లి భరత్‌కుమార్, మాజీ ఎంపీపీ కృపేశ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కోని రాజు, నాయకులు కర్నె అరవింద్, కొండ్రు ప్రవీణ్, రమేశ్, టిల్లు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల అన్నం తిన లేకపోతున్నం

ప్రతిరోజూ పురుగుల బియ్యంతో కూడిన అన్నం పెడుతున్నరు. ఈ పురుగులన్నం తినాలంటేనే భయంగా ఉన్నది. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు, వంట వండేవారు ఏది పెడితే అది తినాలి. ఏంటి మీ లొల్లిక్కడ.. అని బెదిరిస్తున్నారు. మాకు చాలా ఇబ్బందిగా ఉన్నది. మా సమస్యలను ఇప్పటికైనా పరిష్కరించాలి.

- కావ్య, కస్తూర్బా గాంధీ పాఠశాల, ఇబ్రహీంపట్నం

మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు

మా వసతిగృహంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మా పాఠశాలలో మరుగుదొడ్లు శుభ్రం చేయించాలని ఎన్నోసార్లు మా టీచర్లకు చెప్పినా పట్టించుకోవడం లేదు. అందులోకి వెళ్లాలంటేనే తీవ్ర ఇబ్బందిగా ఉన్నది. ఎప్పటికి ఈ సమస్య తీరుతుందో ఏమో.

- సింధు

సబ్బులు, షాంపూలు ఇవ్వడమే లేదు

స్నానాలు చేసేందుకు షాంపూలు, సబ్బులు ఇవ్వడం లేదు. హ్యాండ్‌వాష్ కోసం లిక్విడ్ ఇవ్వక చేతులు కూడా శుభ్రం చేసుకోవడం లేదు. సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అన్ని సౌకర్యాలు కల్పించాలి. మా సమస్యలు తీర్చాలి.

- స్వాతి, కస్తూర్బా గాంధీ పాఠశాల, ఇబ్రహీంపట్నం

గురుకుల బాటకు అడ్డంకులు

- అడుగడుగునా పోలీసుల అడ్డగింత
- అనుమతి లేదని ప్రిన్సిపాళ్ల నిరాకరణ
- బీఆర్ఎస్ నేతలు, పోలీసుల వాగ్వాదం

దుమ్ముగూడెం/కోటపల్లి/బెల్లంపల్లి/మందమర్రి/ఆసిఫాబాద్/మహదేవపూర్/జనగామ రూరల్, డిసెంబర్ 1: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఆదివారం నిర్వహించిన గురుకులాల బాట కార్యక్రమాలను పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరంలోని వసతి గృహాలను ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, రాకేశ్‌రెడ్డి పరిశీలించారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరిశీలించేందుకు వెళ్లగా, అధికారులు అనుమతి ఇవ్వలేదు. జనగామ మండలం పెంబర్తిలోని జ్యోతిబాపూలే బాలికల పాఠశాల, కళాశాల హాస్టల్‌ను బీఆర్ఎస్వీ నాయకులు సందర్శించగా గేటు ముందే ఆపి విద్యార్థులతో మాట్లాడించారు.

కోటపల్లిలో అడ్డుకున్న పోలీసులు

మంచిర్యాల జిల్లాలోని కోటపలి ఆశ్రమ పాఠశాల పరిశీలనకు బీఆర్ఎస్వీ నాయకులు వెళ్లగా ద్వారం తెరవకపోవడంతో వెనుతిరిగారు. అక్కడి నుంచి కోటపల్లి ఎస్సీ హాస్టల్‌కు వెళ్తుండగా ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు.

గేటు వద్దే అడ్డుకున్న ప్రిన్సిపాల్

బెల్లంపల్లి మండలం కాసిపేట ఎస్సీ గురుకుల పాఠశాల పరిశీలనకు బీఆర్ఎస్వీ నాయకులు వెళ్లగా గేట్ వద్దే ప్రిన్సిపాల్ అడ్డుకోగా గేట్ ముందు నిరసన తెలిపారు. రామకృష్ణాపూర్ పాఠశాలను బీఆర్ఎస్ నాయకులు సందర్శించి ఆహార పదార్థాలను పరిశీలించారు.

భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం ఏకలవ్య పాఠశాల వసతిగృహంలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ తాతా మధు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

బెల్లంపల్లి : కాసిపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వద్ద బీఆర్ఎస్వీ నాయకులను అడ్డుకుంటున్న తాళ్ల గురిజాల ఎస్ఐ రమేశ్

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

తిరుమలేశ్ (ఫైల్)

అనంతగిరి, డిసెంబరు 1: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని శాంతినగర్‌లో ఆదివారం ఈతకు వెళ్లి ఓ విద్యార్థి మృతి చెందాడు. విద్యార్థులు, బంధువులు తెలిపిన వివరాలు.. చింతలపాలెం మండలం నక్కగూడేనికి చెందిన గుగులోతు తిరుమలేశ్ (15) శాంతినగర్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతూ స్థానిక సమీకృత హాస్టల్‌లో ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన బత్తిని వీరబాబు హాస్టల్‌లో పాఠాలు బోధించేవాడు. ఆదివారం వీరబాబు తన పొలానికి వెళ్తూ తిరుమలేశ్, తరుణ్‌ను తీసుకెళ్లాడు. పనుల అనంతరం ఈత కొట్టేందుకు వీరబాబు బావిలోకి దిగగా తిరుమలేశ్ అతన్ని అనుసరించి బావిలోకి దూకాడు. గమనించిన తరుణ్ గ్రామస్తులకు సమాచారమిచ్చారు. పోలీసులు మృతదేహాన్ని కోదాడ దవాఖానకు తరలించారు.

గురుకులాలను నిర్వీర్యం చేసే కుట్ర

- విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారు
- రేవంత్‌రెడ్డికి సీఎం మురిపెం పోలేదు
- పాలనపై పట్టుకోల్పోయి పిచ్చి మాటలు
- కేసీఆర్ హయాంలో దేశానికే ఆదర్శం
- బీఆర్ఎస్ నేతలు రాకేశ్‌రెడ్డి, నాగజ్యోతి
- జాకారం, బండారుపల్లిలో హాస్టళ్ల పరిశీలన

ములుగు మండలం జాకారం సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో అపరిశుభ్ర ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేశ్‌రెడ్డి

ఆసిఫాబాద్‌లోని పీటీజీ గురుకులంలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ములుగురూరల్, డిసెంబర్ 1: కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, ములుగు జడ్పీ మాజీ చైర్మన్ బడే నాగజ్యోతి విమర్శించారు. అందుకే గురుకులాల్లో వరుస మరణాలు, ఆహారం కల్తీ అవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహరిస్తుందని తెలిపారు. ములుగు జిల్లా జాకారంలోని సోషల్ వెల్ఫేర్, బండారుపల్లి రెసిడెన్షియల్ గురుకులాన్ని వారు పరిశీలించారు. ప్రభుత్వ వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గురుకులాల్లో పారిశుధ్యం లోపించడంతో వారే స్వయంగా బ్లీచింగ్ పౌడర